www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 20 | అక్టోబర్ | 2026 పేజీలు : 8

## గ్రామీణ రోడ్ల అనుసంధానం, అభివృద్ధే ప్రధానం



- రూ.10 కోట్లతో రేగళ్ల-కరకవాగు బిటి రోడ్డును నిర్మిస్తున్నాం
- నాణ్యతలో రాజీపడేదే లేదు
- ఎంఎల్ఏ కూనంనేని

2లో..

## దుమ్ముగూడెం ఆనకట్టలో నీటి నిల్వ పెంపునకు తక్షణ చర్యలు



-నవంబర్ నుంచి సీతమ్మసాగర్ పనులు ప్రారంభించేలా సన్నద్ధం కావాలి
-నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి
-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/అశ్వాపురం:** రానున్న వేసవిలో మూడు జిల్లాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపునకు తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం

మిగతా 2లో..

## అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందిస్తాం



-ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ
-ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలు ఆగవు
-మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/కూసుమంచి:** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాల అమలును నిలిపివేయబోమని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4.5లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లుత తెలిపారు.

మిగతా 2లో..

## ఇందిరమ్మ వివక్షపై సమరం



-ఇందిరమ్మ కమిటీల పేరుతో సర్పంచ్ హక్కులకు తూట్లు
-జెండా కప్పుకుంటేనే ఇందిరమ్మ ఇండ్లు
-22న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో రాజకీయ వివక్షపై వామపక్షాలతో పాటు బిఆర్ఎస్ సమరానికి సిద్ధమయ్యాయి. ఈ నెల 22న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ పార్టీలు ప్రకటించాయి. వామపక్షాలు బిఆర్ఎస్ నేతల సంయుక్త మీడియా సమావేశం సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగింది. ఆయా పక్షాల బాధ్యులు మాట్లాడుతూ పేదవానికి దక్కాల్సిన ఇండ్ల రాజకీయ కారణాలతో అనర్హులకు లబ్ది చేకూరుతుందని ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికకు సంబంధించిన నిబంధనలను

మిగతా 2లో..

## చెడుపై మంచి గెలుపుకు ప్రతీక దసరా

-పెరిగిన ధరలతో సామాన్యుల సతమతం
-లంచం, అశ్రీత పక్షపాత వైఖరి నశింపే లక్ష్యం

7లో



ప్రజాపక్షం దినపత్రికకు 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు..
విజయదశమి మరియు దీపావళి శుభాకాంక్షలు




గ్రాండ్ ఎంట్రన్స్ ఆర్చ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజి & పవర్ లైన్, మిని థియేటర్, సూపర్ మార్కెట్, మిని ఫంక్షన్ హాల్, ఇండోర్ ఆడిటోరియం, యోగా & జిమ్, గెస్ట్ రూమ్స్
శ్రీ బాలాజీ ఎస్టేట్స్ & కన్‌స్ట్రక్షన్స్
ISO 9001:2015 CERTIFIED COMPANY
SRI BALAJI GROUPS

# దుమ్ముగూడెం ఆనకట్టలో నీటి నిల్వ పెంపునకు తక్షణ చర్యలు



(మొదటిపేజీ తరువాయి)

మండలం అమ్మగారిపల్లి పరిధిలోని ఆనకట్టను పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ డి వేణు గోపాల్, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆనకట్ట పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 0.8టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 0.5 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఇసుక బస్తాలను సుమారు మీటరు ఎత్తు వరకు ఏర్పాటు చేసి నీటి నిల్వను పెంచే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైతే విజయదశమి రోజున కూడా పనులు కొనసాగించేలా ఏర్పాట్లు చేయాలని, నీటి ప్రవాహం తగ్గక ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ చర్యలతో ఒక టీఎంసీకి పైగా నీటిని నిల్వ చేసుకునే అవకాశాలను సాంకేతికంగా పరిశీలించాలని సూచించారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి మూడు జిల్లాలకు తాగునీరు అందించాల్సి ఉన్నందున నీటి వినియోగంపై నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. తాగునీటి అవసరాలను ప్రాధాన్యమిస్తూ, సరిపడా నీరు నిల్వ ఉన్నప్పుడే మిగులు జలాలను ఇతర అవసరాలకు వినియోగించాలని స్పష్టం చేశారు. నీటిని వృథా చేయకుండా ప్రజలు కూడా పొదుపుగా వాడుకోవాలని కోరారు.

**నవంబర్ నుంచి సీతమ్మసాగర్ పనులు....**

వివిధ అనుమతులు, న్యాయపరమైన అడ్డంకులతో గత ఐదేళ్లుగా నిలిచిపోయిన సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులను నవంబర్ నుంచి ప్రారంభించేలా సన్నద్ధం కావాలని మంత్రి ఆదేశించారు. ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు సాధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించేలా యంత్రాగు, సామగ్రి, సిబ్బంది, ఇతర వనరులను సిద్ధం చేసుకోవాలని నిర్మాణ సంస్థకు సూచించారు.

**నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు....**

వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రానున్న వేసవిలో నీరు. విద్యుత్ కొరత ఏర్పడే అవకాశాలున్నాయని మంత్రి పేర్కొన్నారు. రైతులు సాగుకు ముందే నీటి లభ్యత, విద్యుత్ సరఫరా, భూగర్భ జలాల పరిస్థితులను అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఎకరానికి లక్ష నుంచి రెండు, మూడు లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెడుతున్న రైతులు పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరతతో నష్టపోకూడదన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా కూరగాయాలు, పప్పు దినుసుల వంటి తక్కువ వ్యవధిలో దిగుబడి, ఆదాయం ఇచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. ఒకటి, రెండు తడులతో పంట చేతికొచ్చే అవకాశాలను పరిశీలించాలని, అధిక నీరు అవసరమయ్యే పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి తగిన సూచనలు అందించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, నీటిపారుదల శాఖ, ఇతర సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.



# అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందిస్తాం





(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటి వరకు సుమారు 2.30లక్షల నుంచి 2.40లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ 40వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని, ప్రతిపక్ష ఎంఎల్‌ఏల నియోజకవర్గాల్లోనూ పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని చెప్పారు. సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, రైతు రుణ మాఫీ, రైతు బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. నిరుద్యోగ యువతకు ఇప్పటికే 73వేల ఉద్యోగాలు కల్పించామని, మరో 14వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేసినట్లు తెలిపారు. మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు అందిస్తూ ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పేదల ముఖాల్లో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యమని చెబుతూ రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఎంపీడీవో జశ్వంత్ కుమార్, తహసీల్దార్ సైదులు, హౌసింగ్ డీఈ, వివిధ శాఖల అధికారులు, మండల పార్టీ అధ్యక్షుడు బజ్జూరి వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు మద్ది శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీలు బానోత్ శ్రీనివాస్ నాయక్, జుకూరి గోపాల్‌రావు, రామసహాయం వెంకట్‌రెడ్డి, బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి, జొన్నలగడ్డ రవి కుమార్, మంకేనా శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ కొండా కృష్ణవేణి, యువజన నాయకుడు కొండా మహిపాల్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ రోడ్ల అనుసంధానం, అభివృద్ధే ప్రధానం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గ్రామీణ రోడ్ల అనుసంధానం, అభివృద్ధే ధ్యేయంగా నియోజకవర్గంలో రవాణా వ్యవస్థను సమగ్రంగా తీర్చిదిద్దుతున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తాను ప్రత్యేక చొరవతో మంజూరు చేయించిన లక్ష్మీ దేవి పల్లిపాల్వంచ మండలాలను అనుసంధానించే ఐదు కిలోమీటర్ల బిటి రోడ్ నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. రేగళ్లనుండి పెద్దతండా, ఉయ్యాలబాడువా హరియాతండా గేట్‌తండా మీదుగా కరకవాగు వరకు రూ.10కోట్ల వ్యయంతో సాగుతున్న పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మారుమూలు గిరిజన గూడేలు, తండాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేయడం ద్వారా రాకపోకల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా నియోజకవర్గంలో పల్లెబాటలను వేగవంతంగా అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి సమయానికి పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్నారు. ప్రజలు ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా చూడటమే తమ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్ తహశీల్దార్ సరిత ఎంపిడిఓ సుస్మిత అధికారులు రఘుమారయ్య స్థానిక నాయకులు సర్పంచ్‌లు దీటి లక్ష్మీ పతి కంటెం శ్రీనివాస్ దారా శ్రీనివాస్ జర్పుల ఉపేందర్ తాటి లక్ష్మణ్ రాంబాబు బాలాజీ రమేష్ హతీరామ్ పూర్ణ రాంబాబు మాధవరావు ఎస్‌కే నాణ్య ఓంజీ బానోత్ శ్రీను పాలొన్నారు.

# ఇందిరమ్మ వివక్షపై సమరం

(మొదటిపేజీ తరువాయి)

గాలికి వదిలి చట్టబద్ధత లేని ఇందిరమ్మ గ్రామ కమిటీల సిఫారసులను అమలు చేస్తున్నారని వారు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఉండటం లేదా ఆ పార్టీ జెండా కప్పుకుంటేనే ఇండ్లు కేటాయిస్తున్నారని అధికారులు కూడా ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడిందని కాంగ్రెస్ కార్యాలయాల నుంచి వచ్చిన జాబితాను యథాతథంగా ఆమోదిస్తున్నారని వారు ఆరోపించారు. గత ప్రభుత్వం లాటరీ పద్ధతిలో ఇండ్లను కేటాయించిందని కానీ ఇప్పుడు ఆ పద్ధతికి కాంగ్రెస్ తిలోదకాలు ఇచ్చిందన్నారు. గ్రామల్లో సర్పంచుల హక్కులకు ఇందిరమ్మ కమిటీ తూట్లు పొడుస్తుందని దీనిని ప్రభుత్వం ప్రోత్సహించడం శోచనీయమన్నారు. రాజీవ్‌గాంధీ హయాంలో జరిగిన 73, 74 రాజ్యాంగ సవరణకు ఇది పూర్తి విరుద్ధమన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం పేదవాడు అర్హుడైతే రాజకీయ జోక్యం ఎందుకని వివపక్షాల నేతలు ప్రశ్నించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన వాటికి బిల్లులు ఇవ్వకుండా నిలుపుదల చేశారని వాటికి వెంటనే బిల్లులు ఇవ్వాలన్నారు. అవకతవకలకు వ్యతిరేకంగా సమిష్టి పోరాటం చేయాలని ఇందుకు ప్రజలు సంపూర్ణ మద్ధతు ప్రకటించాలని కోరారు. చట్టబద్ధత లేని ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని, సర్పంచులకు పేదల ఎంపిక బాధ్యతను అప్పగించి లబ్దిదారుల ఎంపికకు లాటరీ తీయాలని ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికలో నిబంధనలు పాటించాలని వారు డిమాండ్ చేశారు. శాసనసభకు నిర్ణయాధికారం ఉంటుందని కానీ గ్రామ కమిటీలకు ఏమి నిర్ణయాధికారం ఉంటుందని వారు ప్రశ్నించారు. సర్పంచులు చేసిన గ్రామసభ తీర్మానాలకు అధికారులు విలువ ఇవ్వడం లేదని ఈ తీరు మార్చుకోవాలని వారు సూచించారు. 22న జరిగే మహాధర్నాలో సర్పంచులు, లబ్దిదారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు, ఎంఎల్‌సి తాతామధు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బందారు ఐలయ్య తదితరులు ప్రసంగించగా వివిధ పార్టీల నాయకులు యర్రాబాబు, మాదినేని రమేష్, బండి రమేష్, బెల్లం వేణుగోపాల్, ఆవుల అశోక్, లక్ష్మి నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అధికారి బదిలీ..స్వాగతాల వెనుక అంతర్యమేమిటి..?

**-వీడ్కోలు పలికిన వారే...కొత్త అధికారికి స్వాగతం**
**-కూసుమంచి ఎస్‌ఐల బదిలీపై స్థానికంగా చర్చ**
**-ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ఆశలు**

**ప్రజాపక్షం/కూసుమంచి:** అధికారులు బదిలీ కావడం సహజమే. అయితే వెళ్లే అధికారికి వీడ్కోలు పలికిన వారే కొత్తగా వచ్చిన అధికారికి స్వాగతం పలకడంపై కూసుమంచిలో చర్చ జరుగుతోంది. ఈనెల 15న ఎస్‌ఐ నాగరాజు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎస్‌ఐ సతీష్ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా కొందరు వ్యాపారులు, ప్రజాప్రతినిధులు శాలువాలతో స్వాగతం పలికినట్లు సమాచారం. అధికారులను మర్యాదపూర్వకంగా కలవడం తప్పు కాదు. అయితే పరిచయాలు ప్రజా సమస్యల పరిష్కారానికే పరిమితమవుతున్నాయా? వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నాయా? అన్న సందేహాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసు వ్యవస్థ నిష్పాక్షికత, చట్టం అమలులో సమానత్వం కీలకమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**నిష్పాక్షికతే అసలైన కొలమానం...**

కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ సతీష్ స్థానిక పరిస్థితులను అర్థం చేసుకుని, రాజకీయ పలుకుబడులు, సిఫారసులకు అతీతంగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఉంది. సామాన్యుల నుంచి ప్రజాప్రతినిధుల వరకు అందరికీ చట్టం సమానంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆశిస్తున్నారు.



**బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం ఏదీ...?**

కూసుమంచి బస్టాండ్ సెంటర్‌లో వాహనాల అడ్డగోలు పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య కొనసాగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సమస్యకు ఇప్పటి వరకు శాశ్వత పరిష్కారం లభించలేదని చెబుతున్నారు. కొత్త ఎస్‌ఐ సతీష్ ప్రత్యేక దృష్టి సారించి, పార్కింగ్‌ను క్రమబద్ధీకరించి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులకు స్వాగతాలు, వీడ్కోలు కార్యక్రమాల కంటే ప్రజా సమస్యల పరిష్కారం చట్టం అమలు, శాంతి భద్రతత పరిరక్షణే నిజమైన గుర్తింపునిస్తాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం



**-కబ్జాకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించం**
**-రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సత్వరమే సర్వే చేపట్టి నివేదిక ఇవ్వాలి**
**-సహజ జల వనరుల పరిరక్షణే లక్ష్యంగా కార్యాచరణ**
**-నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం**
**-కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని**



**ప్రజాపక్షం/సుజాతనగర్:** చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతామని, కబ్జాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. సుజాతనగర్ మండల పరిధిలోని సర్వారం కోయగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రూ. 2 కోట్ల నిధులతో నిర్మించనున్న డార్మిటరీ బ్లాక్, కిచెన్ షెడ్ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన శంకుస్థాపన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు, రైతులకు జీవనాధారమైన సహజ జల వనరులు, చెరువు భూములను కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం దర్జాగా ఆక్రమించుకోవడం గర్హనీయమన్నారు. నియోజకవర్గంలో ఆక్రమణలకు గురైన చెరువుల భూములను గుర్తించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రతి చెరువుకు పక్కాగా హద్దులు నిర్ణయించి, కబ్జాలను తొలగించి జల వనరులను కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. చెరువుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి, విద్యావ్యాప్తికి పెద్దపీట వేస్తున్నామని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వారి పరిష్కారంకోసం కృషిచేస్తున్నామన్నారు. సుజాతనగర్ మండలానికి ఇంటర్ వరకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేయించడం జరిగింది గుర్తుచేశారు. సర్వారం కోయగూడెం ఆశ్రమ పాఠశాల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మేయర్ మూడ్ గణేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్, సొసైటీ చైర్మన్ మండే హన్మంతరావు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపిడివో భారతి, ఐటిడీఏ ఈఈ మధుకర్, ఏఈ శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, సర్పంచ్ రామనాథం, నాయకులు భూక్య దస్రు, సిపిఐ మిత్రపక్షల నాయకులు కోమారి హన్మంతరావు, జక్కుల రాములు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర



**ప్రజాపక్షం/వేంసూరు:** వేంసూరు మండలంలోని మర్లపాడు, భరణిపాడు గ్రామాల్లో సోమవారం దుర్గమ్మ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామస్తులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. దుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఆయన ముచ్చటించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర్ రెడ్డి, దొడ్డ వెంకట కృష్ణారెడ్డి, గండ్ర స్వామి రెడ్డి, కంటే వెంకటేశ్వరరావు, శంకర్ రెడ్డి, గోవా శ్రీనివాస్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర ధరలు తగ్గించాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నిత్యావసర వస్తువుల ధరలు రోజు, రోజుకూ పెరుగుతుండటంతో సామాన్యులు, పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఎంఆర్‌పిఎస్ నాయకులు గోళ్లమూడి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలపై ఎం ఆర్ పిఎస్ ఆధ్వర్యంలో సోమవారం సత్తుపల్లిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆదాయాలు పెరగకపోవడంతో పేదల జీవనం భారంగా మారిందన్నారు. ప్రభుత్వం ధరల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, నిత్యావసర వస్తువులు పేదలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల ప్రధాన కార్యదర్శి పరిగడుపు లక్ష్మణ్, మహాజన సోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షుడు గద్దల దేవన్న, మండల కోశాధికారి అయినపూడి సంతోష్, నాయకులు గంధం రాఘవులు, బొల్లెపోగు రాములు, కోట బాబురావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ నగర్‌లో అంభరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**మహిళలు, చిన్నారుల ఆటపాటల సందడి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో గల విజయదుర్గా అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాగణంలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని సాగిన బతుకమ్మ సంబరాలు ఉత్సాహభరిత వాతావరణంలో అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు, చిన్నారులు చేరి ఆటపాటలతో సందడి చేశారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు ఆలపిస్తూ, లయబద్ధంగా చప్పట్లు, డిజే పాటలకు నృత్యాలు, కేరింతల మధ్య వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.పూల సోయగాలు, మహిళల సంప్రదాయ వస్త్రధారణ, చిన్నారుల చిరునవ్వులతో దేవాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. బతుకమ్మ పాటలతో పరిసర ప్రాంతమంతా మార్మోగగా, మహిళలు ఒకరితో ఒకరు కలిసిమెలిసి ఆడిపాడుతూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. చిన్నారులు సైతం ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో సందడి చేయడంతో వేడుకలు మరింత కళకళలాడాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను, ఆత్మీయతను పెంపొందించడంతో పాటు ప్రకృతితో మానవ సంబంధాన్ని చాటిచెబుతుంది. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయి. పట్టణ శివార్లలోని తామర చెరువు వద్ద జరిగిన నిమజ్జనంకు కాలనీ నుండి భారీగా మహిళలు తరలివెళ్ళి బతుకమ్మను సాగనంపారు.

## మహిషాసురమర్ధినిగా అమ్మవారు



**ప్రజాపక్షం/మధిర:** పట్టణంలోని లడక బజార్‌లో దేశభక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేశి శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు మహిషాసుర మర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దివ్యరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు తరలిరాగా, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా మహిషాసుర మర్ధిని అమ్మవారిని కొలుస్తారు. లోకకళ్యాణం కోసం మహిషాసరుడనే రాక్షసుడిని సంహరించిన దుర్గాదేవి రూపమే మహిషాసుర మర్ధిని, ధర్మాన్ని కాపాడుతూ అధర్మాన్ని అంతం చేసే శక్తికి, ధైర్యానికి విజయానికి ఈ అమ్మవారి రూపం ప్రతీకగా నిలుస్తుంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మండపంలో సోమవారం ప్రత్యేక హోమ కార్యక్రమాలను వైభంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చరణలు, హోమాగ్ని మధ్య ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. హోమ కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, దేశభక్తి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# మహిళ ఇంటి ముందు కుటుంబ సభ్యులతో నిరసన



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడి నుంచి రూ.81.50 లక్షలు తీసుకుని తిరిగి చెల్లించకుండా వేదింపులకు గురిచేస్తున్న మహిళ ఇంటి ముందు రిటైర్డ్ ఉపాధ్యాయుడు కుటుంబ సభ్యులతో కలిసి నిరసనకు దిగాడు. సోమవారం కాకర్లపల్లి రోడ్డులోని కాకతీయ నగర్‌లో గల స్వప్న ఇంటి వద్దకు చేరుకున్న సదరు వృద్ధ రిటైర్డ్ టీచర్ నడిఎండలో ఆమె ఇంటి ముందు నిరసనకు దిగటం స్థానకంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్ళితే.. వేంసూరు మండలం అడర్లసపాడు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు చింతమాల వెంకటేశ్వర్లు సత్తుపల్లి లో నివాసముండేవారు. ఆ సమయంలో పక్క ప్లాట్ లో అద్దెకు ఉంటున్న సూరవర్జుల చంద్రశేఖర్, స్వప్న దంపతులు వివిధ అవసరాలు, వడ్డీ పేరుతో 2025 నవంబర్ 20 నుంచి 2026 ఫిబ్రవరి 22 వరకు విడతలవారీగా రూ. 81.50 లక్షలు తీసుకున్నారని బాధితుడు ఆరోపించారు. ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వమని కోరగా చెల్లించకుండా ముసలి వాళ్ళమైన మమల్ని వేధిస్తుందని, పేర్కొంటూ వారి ఇంటి ఎదుట కుటుంబంతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. ధర్నా నేపథ్యంలో పోలీసులు జోక్యం చేసుకుని బాధిత కుటుంబ సభ్యలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నగదు లావాదేవీల వెనుక ఓ రాజకీయ ప్రముఖుడి ప్రమేయం ఉందని బాధితుడు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని, లేకుంటే కుటుంబ సమేతంగా ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

## నీట్‌లో 430 ర్యాంకు సాధించిన వీఎం. బంజర్ విద్యార్థిని



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలం వీఎం బంజర్ గ్రామానికి చెందిన బజ్జూరి రాధాకృష్ణ వరలక్ష్మి దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె అనూష ఉన్నారు. కుమార్తె అనూష నీట్ లో 430 ర్యాంకు సాధించింది. రెండవ కౌన్సిలింగ్ తో సిఎంఆర్ కాలేజీలో హైదరాబాద్ లో ఎంబిబిఎస్ సీట్ పొంది తల్లిదండ్రుల కలను తన లక్ష్యాన్ని సాధించింది. కుమారుడు సైతం చదువులో రాణిస్తూ బీటెక్ చదువుతున్నాడు. చదువులో శ్రద్ధ, ఉన్నత స్థానాలు, లక్ష్యాలను సాధించాలన్న పట్టుదల గ్రహించిన బజ్జూరి దంపతులు చిన్నపాటి టిఫిన్ హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ మరో పక్క చదువులో పిల్లలను ప్రోత్సహించారు. అనూష బీసీ వెల్ఫేర్ సత్తుపల్లిలో 9.2 గ్రేడ్ తో 10 వ తరగతి విద్యని, సోషల్ వెల్ఫేర్ బిఆర్ అంబేద్కర్ కాలేజీ ఖమ్మం లో ఇంటర్మీడియట్ 961 మార్కులతో సాధించింది. నీట్ 430 ర్యాంక్ పొందింది. తల్లిదండ్రులను నమ్మకాన్ని నిజం చేస్తూ కుమార్తె వైద్య విద్యలో సీటు సాధించింది. ఎంబిబిఎస్ సీట్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులతో పాటు, మిత్రులు, పెనుబల్లి మండల ప్రముఖులు ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవంలో డాక్టర్ మట్టా దయానంద్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని రాజీవ్ కాలనీలో గల శ్రీ విజయ దుర్గా అయ్యప్ప స్వామి దేవస్థాన వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప, భవాని మాలాధారణ చేసిన భక్తులకు ఏర్పాటు చేసిన భిక్ష ను వడ్డించి, ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, వేంసూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయ కులు చల్లగుళ్ళ నర్సింహారావు, వినుకొండ కృష్ణ, షరీఫ్, అజయ్(అయ్యప్ప), స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఇల్లందులో మంత్రి పొంగులేటి పర్యటన




**ప్రజాపక్షం/ఇల్లందు:** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య మంగళవారం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మంత్రి పర్యటన వివరాలను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బోళ్ల సూర్యం వెల్లడించారు. మధ్యాహ్నం 2:30గంటలకు సబ్ రిజిస్ట్రార్ నూతన భవనానికి శంకుస్థాపన, మినీ స్టేడియం ప్రారంభోత్సవం, కోర్టు వద్ద బస్తీ దవాఖాన ప్రారంభోత్సవం, ఫారెస్ట్ గ్రౌండ్‌లో దసరా ఉత్సవాల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు కాంగ్రెస్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డు కమిటీల అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు తప్పని సరిగా హాజరుకావాలని కోరారు.

# పాపకొల్లు అటవి ప్రాంతంలో సీతారామ కాలువకు టన్నెల్



## టన్నెల్ ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండలం, పాపకొల్లు గ్రామ పరిధిలోని భోజ్యా తండా అటవీ ప్రాంతంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పథకంలో ప్యాకేజీ నంబర్ 8 కింద నిర్మిస్తున్న జూలూరుపాడు టన్నెల్ పనులను రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా టన్నెల్ నిర్మాణం, పోలేరు లింక్ కాలువ పనులు, ప్రాజెక్టు అనుసంధానంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టులో కీలకమైన జూలూరుపాడు టన్నెల్ పనులను వేగవంతం చేసి వచ్చే విజయదశమి నాటికి పూర్తి చేయాలని అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. టన్నెల్ పనులతో పాటు పోలేరు లింక్ కాలువ నిర్మాణాన్ని సమాంతరంగా చేపట్టి, టన్నెల్ పూర్తయ్యేలోగా కాలువ పనులు కూడా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. గతంలో భారీ మట్టి కట్టల నిర్మాణంపై నిపుణుల కమిటీ సాంకేతిక అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో, టన్నెల్ నిర్మాణంపై సమగ్ర సమీక్ష నిర్వహించిన అనంతరం ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. నిపుణుల కమిటీ సూచనల మేరకు టన్నెల్ నిర్మాణం సురక్షితమైనదిగా, పనులను వేగంగా పూర్తి చేసేందుకు అనుకూలమైనదిగా నిర్ధారించినట్లు తెలిపారు. టన్నెల్ నిర్మాణం పూర్తయితే గోదావరి జలాలను పోలేరు రిజర్వాయర్‌కు తరలించేందుకు మార్గం సుగమమవుతుందని తెలిపారు.

### ప్రతి నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి ముఖ్యమంత్రి 4 వేల కోట్లు ఆమోదం తెలిపారని వెల్లడించారు. ఆయా నియోజకవర్గాల్లో కాలువల నిర్మాణానికి అవసరమైన భూముల విషయంలో రైతులను ఒప్పించి పనులు ముందుకు సాగేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. కాలువల నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లిస్తామని, భూముల సర్వే ఆధారంగా అర్హులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను వినియోగించుకుని జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, రిజర్వాయర్లను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. సింగభూపాలెం, అన్నదైవం, వెంగళరాయసాగర్, వైరా, లంకాసాగర్ తదితర ప్రాజెక్టులకు నీటిని అందించడం ద్వారా రైతులకు ప్రయోజనం కలిగించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మారెళ్ళ పాడు లిఫ్ట్ ద్వారా పినపాక ప్రాంతంలో సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. జూలూరుపాడు టన్నెల్ పూర్తయితే పోలేరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాలకు కూడా సాగునీటి సరఫరా మెరుగుపడుతుందని తెలిపారు.

### ఎల్ నినోతో జాగ్రత్త..

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిన నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి రైతులకు సూచించారు. సాగునీటితో పాటు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా నీరు, విద్యుత్‌ను జాగ్రత్తగా వినియోగించుకోవాలని కోరారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో, తక్కువ వ్యవధిలో చేతికొచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. పంటలు ఎండిపోయి రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జూలూరుపాడు వినోబానగర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం కాలువలో నీటి ప్రవాహాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. జిల్లాలో సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు కరువు పరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచేందుకు గోదావరి జలాల వినియోగం కీలకమని మంత్రి అన్నారు. జూలూరుపాడు టన్నెల్, అనుసంధాన కాలువల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆత్మీయ మిత్రుడు నివాసానికి మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/జూలూరుపాడు: తన ఆత్మీయ మిత్రుడు నివాసానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా వెళ్ళారు. జూలూరుపాడు టన్నెల్ పనులను పరిశీలించటానికి వెళుతూ జూలూరుపాడు సమీపంలోని పాలకొల్లు గ్రామంలో నివాసం ఉంటున్న రోకటి రంగారావు నివాసానికి ఆకస్మికంగా వెళ్లి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ రంగ ప్రవేశం నాటి నుంచి నేటి వరకు కూడా రంగారావు మంత్రి తుమ్మల తోనే ప్రయాణం సాగిస్తున్నారు. ఆరోగ్య రీత్యా మంత్రి తుమ్మలను కలవలేక పోతున్న రంగారావు నివాసానికి మంత్రి ఆకస్మికంగా వెళ్లడంతో వారి కుటుంబ సభ్యులు ఆనందానికి అవధులు లేకుండాపోయింది. మంత్రి తుమ్మల రంగారావుతో చాలాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల వెంట వైరా శాసనసభ్యులు రామదాస్ నాయక్ తో పాటు వైరా నియోజకవర్గ సీనియర్ నాయకులు, తుమ్మల అభిమానులు ఉన్నారు.

# మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా కాకా రాములు



ప్రజాపక్షం/అశ్వాపురం: బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా గొందిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కాకా రాములు నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆయన పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కాకా రాములును అభినందించిన వారిలో మల్లెలమడుగు సర్పంచ్ మచ్చ నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తూము వీరరాఘవులు, బీసీ సెల్ అధ్యక్షుడు బచ్చు వెంకటరమణ తదితరులు ఉన్నారు.

# శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు అన్నదానం



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని ఇరవెండిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి సన్నిధిలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు పంచాక్షరయ్యను శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో తాళ్లూరి ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, బూర్గంపాడు సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

# మనస్విత ఓణీల అలంకరణ వేడుకకు మాజీ జెడ్‌పిటిసి దంపతులు



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండలంలోని జగన్నాథపురం పెద్దమ్మతల్లి సన్నిధిలోని శ్రీ సాయి గణేష్ ఫంక్షన్ హాల్‌లో రెడ్డిపాలెం గ్రామానికి చెందిన పాలకొల్లు సుధాకర్‌రావు, రాధారాణి దంపతుల మనవరాలు, పాలకొల్లు సుమన్‌కుమార్, సరిత దంపతుల కుమార్తె మనస్విత ఓణీల అలంకరణ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు బూర్గంపాడు మండల మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు హాజరై చిన్నారికి అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో రెడ్డిసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోతిరెడ్డి గోవిందరెడ్డి, నుసుము ఆదిరెడ్డి, ఎడమకంటి లింగారెడ్డి, ఎడమకంటి మణికంఠరెడ్డి, నుసుము వెంకటరామిరెడ్డితో పాటు బంధుమిత్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రకృతి పరిరక్షణ, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ



ప్రజాపక్షం/కారేపల్లి: బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, ప్రకృతితో ముడిపడిన పండుగ అని మాజీ ఎంఎల్‌ఏ గుమ్మడి నరసయ్య, ఉస్మానియా యూనివర్సిటీ న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ అన్నారు. ఆదివారం రాత్రి సర్పంచ్ గుమ్మడి సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో వారు ప్రసంగించారు. బతుకమ్మ మహిళల సామూహిక శక్తికి, ప్రకృతితో మనిషికున్న అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. పండుగను ప్రకృతి పరిరక్షణ, మహిళల గౌరవం, తెలంగాణ జానపద కళలు, భాష, యాసలతో ముడిపెట్టి జరుపుకోవాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించని పూలు, సహజ పదార్థాలను ఉపయోగించి చెరువులు, కుంటలను కాలుష్యం నుంచి కాపాడాలని పిలుపునిచ్చారు. జానపద పాటలు, వ్యవసాయ జీవన నేపథ్యం, మహిళల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే బతుకమ్మ సంప్రదాయాన్ని భావితరాలకు అందించాలని కోరారు. అనంతరం బతుకమ్మలు పేర్చిన మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ బిక్కసాని భాస్కరరావు, వార్డు సభ్యులు దోమల సీత, కోడం రమణ, మూడు లలిత, గుమ్మడి నరసింహారావు, మూతి సుబ్బారావు, గొగ్గల కృష్ణ, గ్రామ ఉద్యోగులు గుమ్మడి సమ్మయ్య, జోగ కవిత, పూనెం సక్కుబాయి, ఈసం పారిజాతం, గ్రామ పెద్దలు గుమ్మడి ఎర్రయ్య, కోడం సీతారాములు, మూతి రామారావు, గొగ్గల రామారావు, బానోత్ మోహన్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

# కోట మైసమ్మ బోనాల వేడుకలో ఎంఎల్ఏ కోరం కనకయ్య

## -అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం/ఇల్లందు: విజయదశమి పండుగను పురస్కరించుకుని రేపల్లెవాడ గ్రామ పంచాయితీ పరిధిలోని నిజాంపేటలో శ్రీకోట మైసమ్మ అమ్మవారి బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య వేడుకకు హాజరై గ్రామస్తులతో కలిసి బోనం ఎత్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మండల రాంమహేష్, స్థానిక సర్పంచ్, దిశ కమిటీ సభ్యురాలు బానోత్ శారత, నాయకులు పోటు రవి, మడుగు సాంబమూర్తి, సొసైటీ డైరెక్టర్ కునుసోత్ రాము, మూతి కృష్ణ, దండుగుల శివ, బింగి కృష్ణ, పూనెం శ్రీరాములు, ఆలయ కమిటీ ఛైర్మన్ వాసం భద్రం పాల్గొన్నారు.

# బతుకమ్మ పూల కోసం వెళ్లి చెరువులో మునిగి వ్యక్తి మృతి





ప్రజాపక్షం/అశ్వాపురం: బతుకమ్మ పండుగ కోసం తామరపూలు సేకరించేందుకు వెళ్లిన వ్యక్తి చెరువులో మునిగి మృతి చెందిన ఘటన అశ్వాపురం మండలంలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని కాల్వ బజార్‌కు చెందిన కుర్సం లక్ష్మయ్య(57)ఆదివారం మధ్యాహ్నం భద్రయ్యగారి కుంటకు తామర పూల కోసం వెళ్లాడు. చెరువులోకి దిగి పూలు కోస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయినట్లు బంధువులు తెలిపారు. లక్ష్మయ్య ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు చెరువు పరిసరాల్లో గాలించినా ఆ చూకీ లభించలేదు. సోమవారం ఉదయం చెరువులో వెతకగా, నీటిలోని తీగల మధ్య చిక్కుకున్న ఆయన మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మయ్య మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కాల్వ బజార్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పేదలకు కళ్యాణలక్ష్మీ షాదీముబారక్ కొండంత అండ

**- సిఎంఆర్ఎఫ్ ఆపదలో ఉన్నవారికి కొండత అండ**
**- ఎంఎల్ఏ కూనంనేని**



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** పేదలకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, సిఎంఆర్ఎఫ్ వంటి పథకాలు నిరుపేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ,షాదీముబారక్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెళ్లిల్లు ఆయా కుటుంబాలకు ఆర్ధికంగా భారం కారాదనే ఉద్దేశ్యంతో ఈ పథకాలు అమలవుతున్నాయని అర్హులైన ప్రతీ ఒక్కరికీ సకాలంలో ఈ సాయం అందేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అదే విధంగా తీవ్రమైన రోగాల భారినపడి వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న బాధితులకు సిఎంఆర్ఎఫ్ భరోసానిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ క్రింద కొత్తగూడెం 34, లక్ష్మీదేవిపల్లి 33, సుజాతనగర్ 9 చొప్పున మొత్తం 76 మంది లబ్దిదారులకు రూ.76.08816 విలువైన చెక్కులను అందించారు. అదేవిధంగా సిఎంఆర్ఎఫ్ క్రింద నియోజకవర్గ పరిధిలోని 85 మంది బాధితులకు రూ.3216500 విలువైన చెక్కులు ఇతర జిల్లాల్లకు చెందిన 96 మందిని తన సిఫార్సులతో మంజూరైన రూ.3833750 చెక్కులను పంపిణీ చేశామన్నారు. మొత్తం 181 మంది లబ్ధిదారులకు రూ.7049250 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్‌సింగ్, చైర్మన్ వీరబాబు తహశీల్దార్ కృష్ణ ప్రసాద్, కార్పొరేషన్ కమీషనర్ సుజాత, కంచర్ల జమలయ్య , సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ కార్పొరేటర్లు బండి నర్సింహా, బోయిన విజయ్ కుమార్, కంచర్ల హిమశ్రీ దర్గయ్య యూసుఫ్ దావూద్ తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు మెడికల్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు పట్టణంలోని మెడికల్ షాపుల్లో సోమవారం డ్రగ్ ఇన్స్పెక్టర్ అశ్విని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని మెడికల్ షాపుల్లో నార్కోటిక్ డ్రగ్ కు సంబంధించిన మందులు ఉంటే ఏ వైద్యుల ఓ పి స్లిప్ మేరకు ఇచ్చారా? లేదా ఇస్తే అధిక మోతాదులో ఇవ్వడానికి గల కారణాలను క్షుణ్ణంగా అడిగి వివరాలు సేకరించారు. ఇటీవల అధిక మోతాదులో డ్రగ్ కు సంబంధించిన మందుల విక్రయాలు జరిగాయనే ఫిర్యాదులు మేరకు తనిఖీలు నిర్వహించారని సమాచారం.ఈ తనిఖీలలో సి ఐ పాటి నాగబాబు మరియు పోలీసు సిబ్బంది ఉన్నారు.

# సారూ.. నా పింఛన్ పునరుద్ధరించండి

**నడవలేని స్థితిలో ప్రజావాణికి వచ్చిన వృద్ధురాలి వేడుకోలు**
**-ఐరిష్ యాప్‌లో నమోదు కాక నిలిచిన పింఛన్**




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నడవలేని స్థితిలో ఉన్నాను. పింఛన్ ఆగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాను. సారూ.. నా పింఛన్‌ను పునరుద్ధరించి ఆదుకోండి! అంటూ ఓ వృద్ధురాలు ప్రజావాణిలో అధికారులను వేడుకుంది. కుటుంబ సభ్యుల సహాయంతో ప్రజావాణికి చేరుకున్న ఆమె తన కష్టాలను అధికారులకు వివరించడం అక్కడున్న వారిని కలచివేసింది. నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మంద్రాజుపల్లి గ్రామానికి చెందిన మాళోత్ రాజమ్మ అనే వృద్ధురాలు వచ్చారు. ఐరిష్ యాప్‌లో నమోదు కాకపోవడంతో తన పింఛన్ నిలిచిపోయిందని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వృద్ధురాలి సమస్యపై స్పందించిన ఎంపీడీవో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. నేలకొండపల్లి నుంచి తిరుమలాపురం వరకు రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం లేదని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు కాకమాను మల్లికార్జున్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పలుమార్లు ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై పలువురు దరఖాస్తులు సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీడీవో ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మాదారం పెద్ద చెరువును శుభ్రం చేయించిన సర్పంచ్



**ప్రజాపక్షం/కారేపల్లి:** బతుకమ్మ, గణేశ్ విగ్రహాల నిమజ్జనాలతో మాదారం పెద్ద చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను సర్పంచ్ అజ్మీర ఉమానరేష్ సోమవారం తొలగింపజేశారు. చెరువులో పూలు, ఆకులు, కొమ్మలు పేరుకుపోయి కుళ్లిపోతే పరిసరాలు కలుషితమై గ్రామస్తులు వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని భావించి ఈ చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయితీ సిబ్బంది చెరువులోని వ్యర్థాలను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. ఇందిరమ్మ డైరెక్టర్లు అజ్మీర్ నరేష్, బట్టు నరసయ్య, రమేష్, వెంకన్న, పద్మ గ్రామ పంచాయితీ సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు. చెరువు శుభ్రతకు సహకరించిన సర్పంచ్, డైరెక్టర్లను గ్రామస్తులు అభినందించారు.

# అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ పథకాలు

**- ఐటిడిఏ ఏపిఓ జనరల్ డేవిడ్‌రాజు**

**ప్రజాపక్షం/భద్రాచలం :** అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా ప్రాధాన్యతా క్రమంలో కృషి చేస్తామని ఐటిడిఏ ఏపిఓ జనరల్ డేవిడ్ రాజు అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో తరలివచ్చిన గిరిజనుల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు అందిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలన్నారు. వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి అర్హులైన ప్రతీ ఒక్కరికి విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పివిటిజి అధికారి గన్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య మేనేజర్ ఆదినారాయణ వివిధశాఖల అధికారులు మోహన్ ముత్యాల కృష్ణయ్య చలపతి చంటి నాగేశ్వరరావు రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెంలో :** ప్రజావాణి వినతుల సత్వర పరిష్కారానికి అధికారులు చొరవచూపాలని, ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్రావు అన్నారు.



సోమవారం ఐడిఓసిలో జిల్లా ఉపాధికల్పనాధికారి కే శ్రీరామ్‌తో కలిసి జిల్లా నలుమూలల నుండివచ్చిన దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యవేదికగా నిలుస్తోందన్నారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. పరిష్కారానికి వీలుగాని వాటిపై సమగ్ర నివేదికలు అందించాలని ఆదేశించారు.

# తుమ్మల గారూ.. తుమ్మలచెరువును నింపేది ఎప్పుడు..?

**-మాటలు కాదు, కార్యాచరణ కావాలి : మర్రి మల్లారెడ్డి**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** తుమ్మలచెరువు నాదంటిరి..మరి చెరువును నింపేది ఎప్పుడు?అభివృద్ధికి రూ 25కోట్లు కేటాయించేలా ఎప్పుడు?అని నెల్లిపాక సొసైటీ మాజీ అధ్యక్షుడు మర్రి మల్లారెడ్డి ప్రశ్నించారు. చెరువు అభివృద్ధిపై ప్రకటనలకే పరిమితం కాకుండా పనులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి హక్కుల కోసం పోరాడి తెలంగాణ సాధించుకున్నామని, స్వరాష్ట్రంలోనూ నీటి కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడటం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అశ్వాపురం మండలంలో సీతారామ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు సాగునీటి ప్రయోజనాలు అందడంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. గోదావరి జలాలను ఖమ్మం జిల్లాలోని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు చూపుతున్న శ్రద్ధను స్థానిక రైతుల సాగునీటి అవసరాలపైనా చూపాలని సూచించారు. తుమ్మలచెరువును పూర్తి స్థాయిలో నింపడంతో పాటు ఆధునికీరణ, కట్ట బలోపేతం, అలుగు సమీపంలో ఉన్నత స్థాయి వంతెన నిర్మాణం, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి వంటి పనుల కోసం రూ 25కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రకటనలు కాకుండా కార్యాచరణతో హామీలను నెరవేర్చాలని, చెరువులోకి సాగునీరు ఎప్పుడు విడుదల చేస్తారు, అభివృద్ధి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారనే అంశాలపై ప్రజాప్రతినిధులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మలచెరువు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

# దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

**సిపి సునీల్ దత్‌కు వినతి**

**ప్రజాపక్షం/ ఖమ్మం క్రైం :** తమ కుటుంబంపై దారి కాచి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దమ్మాలపాటి కార్తీక్ వారి కుటుంబ సభ్యులు సిపి సునీల్ దత్‌ను కోరారు. ఆదివారం ఈ మేరకు ఖమ్మం టూటౌన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు దమ్మాలపాటి కార్తీక్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... దమ్మాలపాటి కార్తీక్ సతీమణి వైద్యురాలిగా పనిచేస్తున్నారు. ఆదివారం సాయంత్రం విధులు ముగిసిన తర్వాత ఆమెను ఇంటికి తీసుకు వచ్చేందుకు వెళ్లిన కార్తీక్ అవని ఆసుపత్రి ఎదుట పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్ కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు వచ్చిన తనపై తన భార్యపైన దాడి చేశారని ఆయన తెలిపారు. ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారం దాడి చేశారని అసభ్య పదజాలంతో దూషించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్తీక్ మామ గాడిపర్తి లక్ష్మి నారాయణ ఈ మేరకు టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఆస్తి వివాదం ఉందని వివాదానికి సంబంధించి తన అల్లుడిని, కుమార్తెను బెదిరించేందుకు ఈ దాడి జరిగినట్లు లక్ష్మి నారాయణ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని లక్ష్మి నారాయణ ఫిర్యాదులో పేర్కొన్నారు.

# చెడుపై మంచి గెలుపుకు ప్రతీక దసరా

**-పెరిగిన ధరలతో సామాన్యుల సతమతం**
**-లంచం, అశ్రీత పక్షపాత వైఖరి నశింపే లక్ష్యం**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** దసరా అనేది హిందువులు జరుపుకునే అతి ముఖ్యమైన పండుగ. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. దసరా (లేదా దశహర) అనే సంస్కృత పదం 'దశ' (పది), హర (ఓడించడం లేదా నశింపజేయడం) అనే పదాల నుండి వచ్చింది. దసరా పండుగ చారిత్రిక నేపథ్యాన్ని చూస్తే విభిన్న కాలాలలో ప్రజలను ఇబ్బందులుపెట్టే వ్యక్తులను నశింపజేసి ప్రజలకు శాంతి కలిగించిన ఘటనలకు గుర్తుగా దసరా జరుపుకుంటారని ప్రతీది. మహిషాసురుడు అనే రాక్షసుడు ప్రజలను ఇబ్బందులు పెడుతుంటే దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసునితో తొమ్మిది రాత్రులు భీకర యుద్ధం చేసి పదవ రోజున అతన్ని వధించి విజయం సాధించింది. అందుకు దసరాకు ముందు శ్రీదేవీ శరన్నవరాత్రులను జరుపుకుంటారు. రామాయణంలో మరో కథ ఉంది శ్రీరాముడు సీతాదేవితో కలిసి అడవికి వెళ్లినప్పుడు రావణాసురుడు సీతను అపహరించాడు. రావణాసురుడిని రాముడు అశ్వీయుజ శుద్ధ దశమి రోజున వధించాడు. అందుకు గుర్తుగా దసరాను జరుపుకుంటారు. ఇక మహాభారతంలో 12 ఏళ్ల అరణ్యవాసం, ఒక ఏడాది అజ్ఞాత వాసం పూర్తి చేసుకుని జమ్మిచెట్టుపై దాచిపెట్టిన ఆయుధాలను విజయ దశమి రోజే బయటకు తీశారు. అందుకే జమ్మి ఆకు పూజ చేయడం కూడా సంప్రదాయంగా వస్తుంది. దసరా చెడుపై మంచి గెలిచిన సందర్భానికి ప్రతీకగా చెప్పుకుంటారు. పురాణాల ప్రకారం చెడుపై మంచి విజయం తథ్యమని తెలుస్తుంది. ఇప్పుడు దేశంలో పేదలు, మధ్యతరగతి ప్రజలు, శ్రామిక వర్గాలు హక్కులను కోల్పోయి ఒక ప్రత్యేక పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ దేశంలో లంచం ఒక శాపంగా మారింది. ఈ లంచం అనే పదం అనర్హులను అర్హులుగా అర్హులను అనర్హులుగా మార్చడంతో పాటు తిమ్మిని బొమ్మిని చేసి మొత్తం వ్యవస్థను ఇబ్బందిపెడుతుంది. లంచాలు ఇచ్చుకోలేని వారు ప్రభుత్వ కార్యాలయాల మెట్లు ఎక్కే పరిస్థితి లేదు. అవినీతిని అరికట్టడంలో వైఫల్యం ఇప్పుడు దేశంలో ఒక విపత్తుగా మారింది. ఇక రెండవది పాలకులే అశ్రీత పక్షపాతానికి పాల్పడుతుండటం ఇప్పుడు దేశ ప్రజలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా ఏ వర్గాలకు పాలకులు కొమ్ము కాయాలో ఊతంగా నిలబడాలో అందుకు తద్విరుద్ధంగా సంపన్న వర్గాలకు సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. రుణమాఫీల మొదలు అన్నింటా ఇప్పుడు సంపన్న వర్గాలే పాలకులకు చుట్టాలుగా మారాయి. ఈ దశలో జన్‌జీ ఉద్యమం ఈ దేశ ప్రజలకు ఒక కొత్త సందేశాన్ని ఇచ్చింది. ఏతరం ప్రజా ఉద్యమాలకు దూరంగా ఉందో ఏ తరం సామాజిక అవగాహన లేకుండా వ్యక్తిగత జీవితమే లక్ష్యంగా ఎదుగుతూ పనిచేస్తుందో ఆ తరం ఇప్పుడు ఉద్యమ బాట పట్టింది. నిర్దిష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతుంది. దసరా వేళ జన్‌జీతో పాటు ప్రజా వ్యతిరేక విధానాలపై సాగుతున్న ప్రజా ఉద్యమాలు విజయం సాధించాలని ఆశిద్దాం.

# డీజే డేంజర్..!

**-చెవులు చిల్లులు పడే శబ్దం.. ఆగిన గుండె**
**-చెరువుమాధారంలో బతుకమ్మ సంబురాల్లో విషాదం**
**-డీజే శబ్దానికి మహిళ మృతి**
**-ఒకే గ్రామంలో 9 డీజేల ఏర్పాటు**




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సంబురం విషాదమైంది. బతుకమ్మ పాటల మధ్య మృత్యుఘోష వినిపించింది.. డీజే మోతలతో హోరెత్తిన వేడుకలో ఓ మహిళ కుప్పకూలి ప్రాణాలు కోల్పోయింది. పండుగ వేళ ఆనందంగా గడపాల్సిన కుటుంబంలో తీరని విషాదం నిండింది. చెరువుమాధారం గ్రామంలో బతుకమ్మ ఉత్సవాల ముగింపు సందర్భంగా చోటుచేసుకున్న ఈ ఘటన డీజేల భయంకర శబ్దాల తీవ్రతపై మరోసారి ఆందోళన కలిగిస్తోంది.

### డీజే శబ్దానికి కుప్పకూలిన మహిళ...

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువుమాధారం గ్రామంలో బతుకమ్మ ఉత్సవాల ముగింపు సందర్భంగా భారీగా ఏర్పాట్లు చేశారు. గ్రామంలో పలుచోట్ల బతుకమ్మలను ఏర్పాటు చేసి ఆటపాటలతో సంబురాలు నిర్వహించారు. ఈ వేడుకలను మరింత హోరెత్తించేందుకు పోటీపడి డీజేలను ఏర్పాటు చేశారు. గ్రామంలో ఒకేరోజు ఉత్సవాలు నిర్వహించడంతో డీజేలకు డిమాండ్ పెరిగి, ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా డీజేలను తీసుకొచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో దసరా పండుగ సందర్భంగా తన సమీప బంధువుల ఇంటికి వచ్చిన నేలకొండపల్లి మండలం అప్పలనరసింహాపురం గ్రామానికి చెందిన యలగాల భారతి (50) బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. అందరూ డీజే పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేస్తుండగా, భారతి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం నేలకొండపల్లికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం. అంతవరకు ఆనందోత్సాహాల మధ్య సాగిన బతుకమ్మ సంబురాలు ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయాయి. డీజే శబ్దం



కారణంగానే ఆమె మృతి చెందిందా? అనే అంశంపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. అయితే ఈ ఘటనతో చెరువుమాధారం, అప్పలనరసింహాపురం గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

### తొమ్మిది డీజేలా.. శబ్ద కాలుష్యమా..?

ఒకే గ్రామంలో ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో డీజేలను ఏర్పాటు చేయడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భారీ శబ్దాలతో డీజేలు మోగుతుండటంతో చిన్నారులు, వృద్ధులు, గుండె సంబంధిత సమస్యలున్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పలువురు పేర్కొంటున్నారు. ఉత్సవాల పేరుతో శబ్ద తీవ్రతను పట్టించుకోకుండా వ్యవహరిస్తే, సామాన్య ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండుగలు ప్రజలను ఒక్కచోట చేర్చి ఆనందాన్ని పంచాలి. కానీ పోటీపడి డీజేలు ఏర్పాటు చేయడం, శబ్ద తీవ్రతను పెంచడం వల్ల అదే వేడుకలు భయాందోళనలకు కారణమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### పోలీసులు హెచ్చరిస్తున్నా.. ఆగని డీజేల మోత!

వినాయక చవితి, దుర్గాదేవి ఉత్సవాలు, బతుకమ్మ సంబురాలు.. ఏ వేడుక జరిగినా డీజేలు ఏర్పాటు చేయడం పరిపాటిగా మారుతోందని స్థానికులు అంటున్నారు. డీజేలకు అనుమతులు లేవని పోలీసులు హెచ్చరిస్తున్నప్పటికీ, ఆ తర్వాత కఠిన చర్యలు తీసుకోకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చెరువుమాధారం గ్రామంలో ఇంత పెద్ద ఎత్తున డీజేలు ఎలా ఏర్పాటు చేశారు..? వాటికి సంబంధిత అధికారుల అనుమతులు ఉన్నాయా..? శబ్ద తీవ్రతపై ఎవరు పర్యవేక్షించారు..? నిబంధనలు ఉల్లంఘిస్తే అధికారులు ఏ చర్యలు తీసుకున్నారు.? అనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. బాధ్యులెవరు..? ఓ మహిళ మృతి నేపథ్యంలో డీజేల నిర్వహణ, శబ్ద నియంత్రణ, అనుమతుల వ్యవహారంపై అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. మరణానికి డీజే శబ్దమే కారణమని వైద్యపరమైన నిర్ధారణ లేకుండా తేల్చిచెప్పలేం. అయినప్పటికీ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉత్సవాల్లో శబ్ద నియంత్రణ నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరాన్ని ఈ ఘటన గుర్తుచేస్తోంది. పండుగల పేరుతో ప్రజల ప్రాణాలు, ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు, సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. బతుకమ్మ పాటలు వినిపించాల్సిన వేళ.. డీజే మోతల మధ్య ఓ కుటుంబంలో చీకట్లు అలుముకోవడం ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది.

## సెక్యూలర్ వ్యవస్థకు తూట్లు

**-ఇన్సాఫ్ నాయకులు సలాం**




**ప్రజాపక్షం/ ఖమ్మం/ ఏన్కూరు :** మోడీ ప్రభుత్వం సెక్యూలర్ వ్యవస్థకు తూట్లు పొడుస్తుందని తన్జీమ్ ఎ ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహ్మద్ సలాం తెలిపారు. మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ లబ్ది పొందెందుకు ప్రయత్నిసుందని ఆయన ఆరోపించారు. ఏన్కూరు మండలం బురదరాఘవాపురం గ్రామంలో జరిగిన ఇన్సాఫ్ సమావేశంలో సలాం మాట్లాడుతూ దేశంలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా మతాన్ని అడ్డుపెట్టుకుని పాలన సాగిస్తున్నారన్నారు. మోడీ పాలనలో దేశం మునుపెన్నడు లేని సంక్లిష్ట ఆర్థిక స్థితిని ఎదుర్కొంటుందని సలాం తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి మోడీ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందని ఆయన ఆరోపించారు. మైనార్టీలను శత్రువులుగా చూపడం ద్వారా రాజకీయ లబ్ది పొందెందుకు బిజెపి ప్రయత్నిస్తుందని ఈ ప్రయత్నాలను ముస్లిం మైనార్టీలు ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సంక్షేమం, ఇతర హక్కుల కోసం పోరాడాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్, జాగర్లమూడి రంజిత్‌కుమార్, నాయకులు మల్లెంపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షులుగా నన్నేసాహెబ్, అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్‌కె షకీల్, బషీర్ లతో పాటు 10 మందిని నూతన కమిటీగా ఎన్నుకున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండల పరిధిలోని రామనుజవరం గ్రామ పంచాయతీలో గల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల గత 1991 నుండి 1996 సంవత్సరం వరకు ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు గత 30 సంవత్సరాల తరువాత ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. పాఠశాలలో మొదటిసారి పదవ తరగతి మొదలవటం 1996 సంవత్సరం నుండి పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులందరూ కలవటం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. అప్పుడు విద్యను బోధించినా గురువులకు సన్మానం చేసి వారి యొక్క అమూల్యమైన పదాలను స్వీకరించి గురువుల యొక్క ఆశీర్వాదం తీసుకోవడం గత 30 సంవత్సరాల లో జరిగిన అనుభవాలను ఒకరికొకరు చర్చించుకుంటూ ఆనందంగా ఈ యొక్క సమ్మేళనాన్ని నిర్వహించారు. పాఠశాలఆవరణంలో నిర్వహించినటువంటి పూర్వ విద్యార్థుల సమ్మేళనం చాలా సంతోషంగా ఉందని చదువు చెప్పిన గురువులు కోటయ్య విజయ్ కుమార్ సత్యనారాయణ నరసింహారావు మాట్లాడుతూ మమ్మల్ని పూర్వ విద్యార్థులు ఇప్పటివరకి గుర్తించుకొని మాకు ఈ అవకాశం కల్పించిన మమ్మల్నిసన్మానించిన విద్యార్థులకు అందరికీ ఆశీర్వాదం అందించారు. ఈ కార్యక్రమం లో పూర్వ విద్యార్థుల పదవ తరగతి 199596 ఆర్గనైజింగ్ కమిటీసరెడ్డి రవి, మండవ వెంకటనారాయణ, రాజబోయిన శ్రీనివాసరావు, సుద్దపల్లి చెన్నారెడ్డి, సిరికొండ నాగేశ్వరరావు, ఎర్ర కృష్ణ, జహీరా బేగం, ఎడారి సురేష్, టి.ముత్యాలరరావు కోటేశ్వరరావు లతో పాటు 30 మంది 1995 96 లో చదువుకున్న టెన్త్ పదవ తరగతి విద్యార్థులు అందరూ కూడా పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు.

## శివగిరి మణికంఠ క్షేత్రం ఆలయాన్ని సందర్శించిన సండ్ర



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం నూతనకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శివగిరి మణికంఠ క్షేత్రం ఆలయాన్ని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య సోమవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం దిన దినాభివృద్ధి చెందాలని, స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. సండ్ర వెంకటవీరయ్యకు ఆలయ అర్చకులు, స్వాములు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, తల్లాడ టౌన్ అధ్యక్షులు జివిఆర్, నూతనకల్ మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు, వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాయుడు శ్రీనివాసరావు, అన్నారుగూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, రంగం బంజర మాజీ సర్పంచ్ లింగా, జోనల్ ఛైర్మన్ కేతినేని చలపతి రావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నవంబర్ 15 నాటికి వెలుగుమట్ల కాలనీ పనులు పూర్తి

**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నవంబర్ 15 నాటికి వెలుగుమట్ల కాలనీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఇండ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పన, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సోమవారం వెలుగుమట్ల కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ 300 ఇండ్లను నవంబర్ 15 నాటికి పూర్తి చేయాలని పనుల పురోగతికి సంబంధించి ప్రతి రెండు మూడు రోజులకు ఒకసారి ప్రత్యేక నివేదికను సమర్పించాలని ఆదేశించారు. అన్ని ఇండ్లను ఒకే నమూనాలో ఆకర్షణీయంగా నిర్మించాలని ఒకే రంగు వేయాలని అవసరమైతే సిబ్బందిని అధికంగా నియమించి పగలు, రాత్రి పనులు పూర్తి చేయాలన్నారు. ఇండ్ల నిర్మాణంతోపాటు రహదారులు, డ్రైనేజీలు, షాపింగ్ కాంప్లెక్స్, బస్తీదావాఖానా, కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం తదితర మౌలిక వసతులను కల్పించాలన్నారు. అన్ని పనులను సమాంతరంగా చేపట్టాలని తెలిపారు. దీపావళి నాటికి సోలార్ రూఫ్ టాప్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిసెంబర్ తొమ్మిదిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కాలనీని ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. ఈ ప్రాంతంలో మోసపోయిన పేదలకు శాశ్వత నివాసాలు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా వెలుగుమట్ల కాలనీని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిస్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, దీపక్ చౌదరి, కమర్తపు మురళీ పాల్గొన్నారు.

**ఈర్లపుడి చెరువును పరిశీలించిన మంత్రి...**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం రఘునాథపాలెం మండలంలోని ఈర్లపుడి చెరువును పరిశీలించారు. మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఈర్లపుడి చెరువును నింపడం జరిగిందన్నారు. రైతులు జల ఆధారిత పంటలను సాగు చేయవద్దని ఎల్‌నినో ప్రభావం కారణంగా రానున్న కాలంలో మరింతగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని మంత్రి తుమ్మల రైతులకు సూచించారు.

# దసరా శుభాకాంక్షలు : కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** చెడుపై సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయ దశమి పండుగను ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. దశరా పర్వదినం ప్రతీ ఇంటా ఆనందం ఆయురారోగ్యాలు సిరి సంపదులు నింపాలన్నారు. ప్రజంతా ఐఖ్యమత్యంతో సోదరభావంతో ముందుసు సాగాలని పిలుపునిచ్చారు.

# పోలీస్ కమిషనర్‌ను కలిసిన నారపోగు



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌కు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఎస్సి విభాగం వైస్ ఛైర్మన్, తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన నారపోగు వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఖమ్మం సిపి కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేక దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో సేవలందిస్తున్న సిపిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన తెలిపారు. వెంకటేశ్వర్లు వెంట తీగల నాగరాజు ఉన్నారు.

# గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పన

**-రూ. 5కోట్లతో గిరిజన హాస్టళ్ల నిర్మాణం**
**-మంత్రి పొంగులేటి**



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** గిరిజన విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో ఐదు కోట్ల వ్యయంతో నిర్మించనున్న గిరిజన బాలుర వసతి గృహానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 150 మంది విద్యార్థులకు వసతి కల్పించేలా ఈ హాస్టల్ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో టిఎన్‌జీవోస్ కాలనీ ప్రాంతంలో గడిచిన మూడేళ్ల కాలంలో రూ. 14 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలతో ఈ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తుందని పొంగులేటి తెలిపారు. సన్న బియ్యం, నూతన రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు మొదలైన అనేక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్నామని ఆయన తెలిపారు. రైతులకు రైతు భరోసా, రుణమాఫీ తదితర పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రెండవ పంట సాగు విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి వనరులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఏస్, జేసి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి. అనిత, వైస్ ఛైర్మన్ తమ్మినేని నవీన్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ ఆలయం వద్ద మహా అన్నదానం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ పట్టణం వైరా రోడ్డులోని నారాయణపురం గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ దేవాలయం వద్ద సోమవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దసరా పర్వదినం సందర్బంగా శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు వెదురు కృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ముగింపు సందర్బంగా ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమ్మవారి దయవల్ల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ భక్తబృందం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన విజిలెన్స్



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టును వైరా వ్యవసాయ మార్కెట్ విజిలెన్స్ సభ్యులు నరేష్‌కుమార్, వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులైన ధాన్యం, పత్తి, మిర్చి మద్దతు ధరలను అనుసరించి మార్కెట్ ఫీజు వసూలు చేయాలని సూచించారు. మిర్చి పంటకు ప్రస్తుతం మార్కెట్‌లో నమోదవుతున్న ధరల ప్రకారం ఫీజు వసూలు చేయాలన్నారు. ఎవరైనా లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తే మార్కెట్ చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్బంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, పాషా ఉన్నారు.

# ఊరూరా సంక్షేమ సామాజిక భవనాలు నిర్మిస్తున్నాం..

**- ప్రజల సౌకర్యార్థమే భవనాల నిర్మాణం**
**- పేదల కోసం కమ్యూనిటీ హాళ్లు**
**- ప్రజల అవసరాలకే నిధుల వినియోగం**
**- ఎంఎల్‌ఏ కూనంనేని**





**ప్రజాపక్షం/పాల్వంచ :** సమాజంలో పేదవర్గాల వారు అంబేద్కర్ భవన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజా ప్రయోజనాల కోసం సంక్షేమ భవనాలు సమాజిక భవనాలు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు చేపడుతున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మండల పరిధిలోని లక్ష్మీ దేవిపల్లి (ఎస్) గ్రామపంచాయితీలో గల అంబేద్కర్ భవనానికి అదనపు బ్లాకుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్‌ఏ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీ పంచాయితీతో పాటు కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీ హాళ్లు సమాజిక భవనాలను విస్తృతంగా మంజూరు చేయించి ఒక్కొక్కటిగా ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. సామాజిక కార్యక్రమాలు సభలు సమావేశాలు నిర్వహించేందుకు ఈ భవనాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ఈ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ధేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు స్థానిక మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్ సర్పంచ్ భూక్యా మంజుల కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీశంశెట్టి పూర్ణచంద్రరావు, అంబేద్కర్ భవన్ నిర్మాణ కమిటీ సభ్యులు కాల్వ భాస్కర్, ప్రకాష్ దాసరి నాగేశ్వరరావు కొత్తపల్లి సోమయ్య దండోరా శ్రీను కత్తి శ్రీను రాంబాబు సిపిఐ నాయకులు ఇట్టి వెంకట్రావు ఆలపాటి ప్రసాద్ నామ నవీన్ పందు ఎరుకుల వెంకటేశ్వర్లు విజయ్ ఎంపిడిఓ పంచాయితీ రాజ్ డిఇ ఏఇ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో సత్తుపల్లి ఎంఎల్‌ఏ మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు. తల్లాడ మండలంలోని బిల్లుపాడు, అన్నారుగూడెం, తల్లాడ, పినపాక తదితర గ్రామాల్లో నిర్వహించిన పలు వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. ఆడబిడ్డల ఐక్యతకు, ఆత్మ గౌరవానికి ప్రతి రూపమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొడ్డు వెంకటేశ్వర్లు, పి. నాగేశ్వరరావు, బొడ్డు రామ లక్ష్మణ్, బొడ్డు చిన్న నర్సింహులు, దూపాటి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.